# హాలాహలం

తెల్లటి మంచు కప్పబడ్డ ఆ శవాలు... ఒక్కొక్కటే పైకి లేచి వరసగా రోబోట్లలా అడుగులు వేసుకుంటూ మాకు ఎదురొస్తూంటే అవన్నీ ఎక్కడ మా కారుని చిదిమేస్తాయో, మమ్మల్ని మింగేస్తాయోనని భయంతో వణికిపోయాన్నేను. చిత్రమేమిటంటే ఈ శవాలన్నీ బక్కపలచగా, వికృతంగా పేగులెండుకుపోయి... మింగడానికి కాకుండా దోచుకోడానికి వస్తున్నట్టున్నాయి... దెయ్యాలు, భూతాలూ వినడమే తప్ప చూడ్డమైతే ఇదే మొదటిసారి...

"ఏయ్ ఏంటిది?... హేమా ప్లీజ్... కొంచెం కంట్రోల్ చేసుకో" సురేష్ ఏదో పలకరిస్తుంటే ఏడుస్తున్నానని అర్థమై మగతలో నుండి బయటపడ్డాను.

మెలకువలోకి రావడం మరింత భయంకరంగా వుంది. మనసు కాలుతోంది... దయాకర్ ఇటువంటి పనిచేస్తాడని, చేయగలడనీ నేనెప్పుడూ ఊహించలేదు. మా కుటుంబంలో ఎవరూ ఇలా అర్థాంతరంగా చనిపోయిన జ్ఞాపకంలేదు... అందునా ఆత్మహత్యల జాడే కనిపించదు... ఛ... ఛ... దయ ఇట్లా చేస్తాడనుకోలేదు...

తెల్లవారుఝాము మంచు శరీరాన్నీ, మనసునీ కూడా ముద్దచేస్తోంది... ఎప్పుడూ ఎడాతెరిపీ లేకుండా సాగిపోయే వాహనాలతో వుండే మెయిన్‌రోడ్డుమీద మంచు ప్రభావానికి కాబోలు, అప్పుడొకటి, అప్పుడొకటీ బండ్లు ఎదురొస్తున్నాయి. వాటి లైట్లు కారు అద్దంమీద పడి కిరణాలు కిరణాలుగా పరావర్తనం చెందుతున్నాయి. దట్టమైన ఆ మంచుని చీల్చుకుని వెళ్ళడం కారులో కాకుండా మేఘాల్ని దాటుకువెళ్తోన్న విమానంలో వున్నట్టుగా వుంది.

అయితే... ఇవేవీ కూడా నా మనసుని తాకడంలేదు... గుండెల్లో సన్నగా మంట... అలజడి... ఆపుకోడం సాధ్యంకాని టెన్షన్...

"డ్రైవర్ కొంచెం త్వరగా పోనీ" టాక్సీ అతన్ని తొందరపెట్టాను.

"ష్... డెబ్బైమీద పోతున్నాడు"... విసుక్కున్నాడు సురేష్.

అప్పటివరకూ బిగబట్టుకున్న దుఃఖం చప్పున బయటికి తన్నుకొచ్చింది... నా ఒళ్ళో నేనే తలపెట్టుకుని ఏడవసాగాను.

సురేష్ చేయి నా వెన్ను నిమురుతూ సముదాయించడానికి ప్రయత్నిస్తోంది... ప్చ్... ఎంతకీ సమాధానం కుదరడంలేదు.

మా మేనత్త కొడుకులు ముగ్గురిలోనూ దయాకర్‌తోనే నాకు అనుబంధం ఎక్కువ... మిగిలిన ఇద్దరూ నాకంటే పెద్దవాళ్ళు కావడం... ఎప్పుడూ చదువే ధ్యేయంగా వుండడంతో వాళ్ళిద్దరితో అంత చనువులేదు. దయాకర్, నేనూ ఒకే ఈడువాళ్ళం కావడం, ఒకే బడిలో ఒకే తరగతిలో వుండడంతో, చిన్నప్పట్నుండి ఇద్దరిమధ్య స్నేహమూ, చనువూ ఎక్కువ.

దయాకర్ ఆసక్తిలేక చదువు మానేయాలనుకున్నప్పుడూ, జ్యోతిని ప్రేమించినపుడూ కూడా తల్లితో, అన్నలతో కాకుండా ముందుగా నాతోనే చెప్పి తల్లికి చెప్పమని బతిమాలాడు.

చదువు పూర్తిగాకుండానే పెళ్ళేమిటని అన్నలూ, తల్లీ విసుక్కుంటున్నా తనే అత్తని ఒప్పించి పెళ్ళి జరిపించింది.

పెద్దకొడుకులిద్దరూ మంచి ఉద్యోగాల్లో స్థిరపడి ఒకరు మద్రాసులోనూ, మరొకరు హైద్రాబాదులోనూ వుండడంతో అత్త ఎక్కువగా వాళ్ళతోనే వుంటుంది... తనెప్పుడూ నవ్వుతూ అత్తని దెప్పిపొడిచేది... పల్లెటూరి కోడలి మీద ప్రేమలేదంటూ...

దయాకర్‌కి చదువబ్బకపోవడంతో ఊళ్ళోనే వుండి పొలాల్ని దున్నుకోవడం మొదలు పెట్టాడు. దయాకర్‌కి మా ఊరన్నా, మామ పండించిన ఆ పొలాలన్నా అమితమైన ప్రేమ. అయితే అన్నలు కూడా పొలంలో వాటా కావాలని పేచీపెట్టక తమ్ముడు స్థిరపడితే చాలను కున్నారు.

దయాకర్ ఎప్పుడైనా ఎరువుల కోసమో, మందుల కోసమో టౌన్‌కి వచ్చినప్పుడు వ్యవసాయం ఇంతకుముందులా కాదనీ, చాలా కష్టమైపోతోందనీ వాపోయేవాడు. వర్షాలు లేకపోవడం, అకాలవర్షం, కొత్తకొత్త తెగుళ్ళు వాటికి కొత్త పేర్లు పెడుతోన్న ప్రభుత్వమూ, నకిలీ పురుగులమందులూ, బలంలేని ఎరువులు... ఇలా నాకర్థమైనా కాకపోయినా దయాకర్ చెప్తుంటే శ్రద్ధగా వినేదాన్ని.

గడ్డి లేదని ఎద్దుల్ని అమ్మేశానని కళ్ళల్లో నీళ్ళు తొణికిసలాడుతూ చెప్పాడో రోజు...

"ఆ నేల కూడా అమ్మిపారేయ్... పీడా వదలద్ది ... ఇక్కడికొచ్చి ఏదన్నా వ్యాపారం పెట్టుకుందువుగానీ" పెరుగుగిన్నె తీసి దయాకర్ ముందు పెడుతూ యాదాలాపంగా అనేశాను

చేతిలో ముద్దని ప్లేట్లో పెట్టేసి ముందు సీరియస్‌గానూ, ఆ తర్వాత దీనంగానూ నా కళ్ళల్లోకి చూశాడు. నా మాటల్లోని వ్యవసాయ వ్యతిరేకత దయని బాగా బాధించినట్లుంది.

"అవునవును... అమ్మని కూడా అమ్ముదామనే చూస్తిని ఆ నడుమ రొయ్యల కాంట్రాక్ట ర్లొచ్చి పొలాలు కావాలంటే... తీరా చూస్తే నా తల్లిగుండెల్లో కన్నీళ్ళే తప్ప ఉప్పునీళ్ళు పడవంట" జీరబోయిన గొంతుతో పెరుగేసుకోకుండానే లేచి చేయి కడిగేసుకున్నాడు దయాకర్...

నేలతల్లంటే నీకెంత ప్రేమ దయా?... అటువంటి తల్లిమీద క్రమంగా నమ్మకం పోగొట్టుకోవలసి రావడం... అట్లాంటి పరిస్థితుల్లోకి నెట్టబడ్డందుకు నీలో నువ్వే ఎంత మధన పడ్డావో నాకిప్పుడు తెలుస్తోంది... క్షమించు దయా, నేనిప్పుడు ఆకులు పట్టుకుని ఏంచేయను? తలబాదుకుని ఏడవాలన్న ఆలోచనని బలవంతాన ఆపుకొన్నాను.

ఊళ్ళు ఒకదాని తర్వాత మరొకటి గుడ్డిగుడ్డిగా కనిపించి కనుమరుగౌతున్నాయి.

మా ఊరికి దగ్గరయ్యేకొద్దీ... గ్రామాలు వెలవెలపోతున్నాయి... నా చిన్నప్పుడయితే ఈవేళకే ఊళ్ళు కళకళలాడుతుండేవి... పాలు తీసేవాళ్ళూ, పేడ జవిరేవాళ్ళూ, బర్రెలకి మేత పెట్టేవాళ్ళూ, మోకులు భుజానేసుకుని పొలానికి పొయ్యేవాళ్ళూ, పాలు పోసుకుని పోవడాని కొచ్చినవాళ్ళ సైకిల్‌బెల్‌లు, నిద్రలేచినవాళ్ళ కలగాపులమైన మాటలూ, కొక్కొరకో అంటూ కోడి పిలుపులూ... ప్రతిదినం ఒక పండగమాదిరుండేది.

మరీ పండగ నెల్లో అయితే చెప్పేదానికేల్యా... అట్లాటిది ఇప్పుడు ఐదున్నరైనా ఎక్కడా ఏ సందడీలేదు... ఏ ఇంటిదొడ్డిలోనూ అంత గడ్డివామి లేదు... పశువులసలే లేవు... ఉండేటి వొకటి రెండు బక్కచిక్కిపోయున్నాయి... కొట్టాలన్నీ చెదలుపట్టిపోయి కూలిపోయేట్టుండాయి... మా ఊళ్ళో గ్రామదేవత అంకమ్మగుడి కూడా గోడలన్నీ పెచ్చులూడిపోయి, ఉప్పుదేలి... వెల వెలపోతోందిప్పుడు. అంకమ్మ గుడిలో వుందో, వెళ్ళిపోయిందో తెలీడంలేదు.

పల్లెటూర్లలో కూడ జీవితం ఇంతకుముందుకీ, ఇప్పటికీ ఎంత తేడా అయిపోయిందో ఆలోచిస్తూ కారు ముందు సీటు మీదికి తలవాల్చాను. ష్...మంటూ భారమైన నిట్టూర్పొకటి నన్నొదిలి వెళ్ళింది.

* * *

పడుకుని ప్రశాంతంగా నిద్రపోతున్నట్టుగా వున్నాడు దయాకర్. నాతో తీసుకెళ్ళిన పూలమాలని వెయ్యాలన్న సంగతికూడా మర్చిపోయి, దయ ముఖంలోకి చూస్తుండిపోయా న్నేను... మూసుకుని వున్న కనురెప్పలు నలిగివున్నాయి. జీవితంలో ఎప్పుడూ ఒక్కమాట కూడా పెద్దగా, పరుషంగా మాట్లాడి ఎరగని పెదవులు నలుపు తిరిగి వున్నాయి. బుగ్గలు లోతుకిపోయి, ఆ గుడ్డిబల్బు వెలుతురులో దయని కాకుండా వేరెవరినో చూస్తున్నట్లుగా వుంది నాకు...

పూర్తిగా తెల్లారకపోవడంతో ఇంకా ఎవరూ వచ్చినట్లుగా లేదు... జ్యోతి పక్కన మా పెద్దమ్మ... ఇంకా జ్యోతి తల్లి, ఆమె తాలూకు బంధువులొక అయిదారుమంది కూర్చుని వున్నారు. అత్త కూడా ఇంకా రాలేదు... చార్మినార్‌లోగాన దిగతారేమో.

శవం పక్కన పేరుకుపోయివున్న ఆ తెల్లవారుఝాము నిశ్శబ్ధం మంచుకన్నా చల్లగా మనసుని కోస్తోంది.

అప్పటిదాకా దయాకర్ పక్కనే సోలిపోయి పడివున్న జ్యోతి పైకిలేవాలని ప్రయత్నించి పడిపోబోయి, ఎట్టకేలకు నిలదొక్కుకుంది... నిన్న ఎప్పుడు దువ్వుకున్న తలో అంతా ఊడిపోయి వెంట్రుకలు చిర్రుచిర్రుగా వేళాడుతున్నాయి... రంగుపోయి మాసి వున్న నైలెక్స్‌చీర వంటిమీద సగం, నేలమీద సగం జీరాడుతోంది.

రెండుచేతులూ పైకెత్తి నన్నుచూసి బిగ్గరగా ఏడుపందుకుంది జ్యోతి... ఇటువంటి సమయాల్ని ఎదుర్కోవడం నాకెప్పుడూ కష్టమైన విషయమే... నా దుఖాన్నే మరెవరైనా దోసిలిపట్టి పంచుకుంటే బావుండునని వున్న ఈ స్థితిలో జ్యోతికి నేనేం చెప్పగల్గును ?... అప్రయత్నంగా ఆమెపక్కనే కూలబడి వీపుమీద చెయ్యేశాను.

కదిలిపోతోంది జ్యోతి...

"ఎంత పనిచేసిపోయినాడో చూడక్కా... నేనేం తప్పుచేశాననీ... నా కెట్టబతకాలో చెప్పకుండా పోయినాడే. కష్టాలు మనుషులిక్కాకపోతే మానులకొస్తాయా?... తనొక్కడే సుఖపడిపోతే చాలుననుకున్నాడు... నాక్కూడా ఇంత పెట్టుండకూడదా పెరుగుబువ్వ... హయ్యో నేనేం చేసేదక్కా... ఈ బిడ్డల్ని పెట్టుకుని ఎట్టబతికేది... మమ్మల్ని దిక్కులేనోళ్ళని చేసిపోయినాడే..." తలబాదుకుంటూ, వాళ్ళిద్దరి నడుమా జరిగిన అనేకానేక స్మృతుల్ని ఒక్కొక్కటిగా గుర్తు తెచ్చుకుంటూ, నెమరేసుకుంటూ ఏడుస్తోంది.

జ్యోతి ఏడుపుతో దుఖం నిండిన నా గుండెలు ఎగిసిపడుతున్నాయి... ఆమెని పట్టుకున్న నా చేతులు వణుకుతున్నాయి... ఏడుపుని బలవంతంగా ఆపుకోవడంతో గొంతు విపరీతంగా నొప్పెడుతోంది...

అసలేం జరిగిందో తెలియక పెద్దమ్మవంక చూశాను...

దయాకర్‌కి అటువైపుగా కూర్చునివున్న పెద్దమ్మ మౌనంగా లేచి మా ఇద్దరి పక్కగా వచ్చి కూర్చుంది.

"నిన్న మధ్యాన్నం కయ్యికాడికి పొయ్యేటప్పుడు కూడా అంతబాగా మీ పెదనాయన్ని ఎచ్చరించుకొని పొయినాడమ్మా... రాత్రి ఎప్పుడు తిరిగొచ్చిందీ నేను చూడల్యా... పది గంటలప్పుడు చిన్నోడొచ్చి 'అమ్మమ్మా అమ్మ పిలుస్తుండాదంటే' పరిగెత్తినా... అప్పటికే యాముండాది... రిక్షా పిల్చుకోని ఏస్కోని పరిగెస్తిని... డాక్టరుకాడికి పొయ్యేలోపల్నే అంతా. అయి పొయ్యింది... కల్తీ మందులంటారు... నకిలీ మందులంటారు... పురుగేమో చావడంలేదు... మనుషులు మాత్రం నిమిషాలమీద ఎగిరిపోతుండారు... అయ్యేం మందులోతల్లా" రాత్రి నుండి టెన్షన్‌లో పడి ఏడుపు మర్చిపొయ్యినట్లుగా హఠాత్తుగా పెద్దమ్మ ఏడవసాగింది...

పెదమ్మ చెప్పింది సంపూర్ణంగా లేదన్నట్లు జ్యోతి కొనసాగించింది... "రాత్రి ఎనిమిది గంటలకొచ్చినాడకా పొలంకాడ్నుండి. ఒకమాదిరిగా, మౌనంగా వుణ్ణాడు... అయితే మామూలుగానే అన్నం తిన్నాడు. పక్కింటోళ్ళ రవివస్తే కాసేపు మాట్లాడినాడు... పిలకాయలతో ఆడతా వున్నాడుకా... నేను వంటింట్లోంచి అన్నీ సర్దుకుని వచ్చేతలికి దేవుడి ముందు కూచుని ధ్యానం చేసుకుంటున్నాడు... ఎంతసేపైనా లేచి రాకపొయ్యేతలికి పొయ్యి చూసేలోపల పక్కకి పడిపొయ్యుండాడు... పక్కనంతా ఈ గుళికలమందు పొడిపొడిగా రాలుంది... నా నడుములిరిగిపొయ్యాయనుకో..."

రాత్రి నుండి ఈ సంఘటనని ఎన్నిసార్లు గుర్తుకుతెచ్చుకందో, ఎన్నిసార్లు ఎంతమందికి చెప్పిందోకానీ అరిగిపోయివుంది జ్యోతి గొంతు... ఏడుపు, దుఖమూ, అన్నీ ఆపి భర్త ముఖం లోకి తదేకంగా చూడసాగింది...

క్షణాలు గడుస్తున్నాయి... చిరుచీకట్లు తొలగి వెలుతురు కిరణాలు లోపలికి ప్రసరిస్తు న్నాయి... పక్కింట్లో, ఎదురింట్లో వాకిళ్ళు ఊడ్చి కళ్ళాపు చల్లుతున్న చప్పుడు నిశ్శబ్దాన్ని చెదరగొడుతోంది.

అప్పుడే నిద్రలేచిన దయాకర్ కూతురు రెండేళ్ళ దివ్య తప్పటడుగులేసుకుంటూ వచ్చి "మా...మా... నానా... నానా" అంటూ దాని భాషలో ఏదో ప్రశ్నించింది.

జ్యోతి మళ్ళీ గట్టుతెగిన ప్రవాహమైపోయింది.

చిన్నప్పుడు నేనూ, దయా కలిసి చదువుకున్న ఇంగ్లీషు పాఠం "ది డెడ్ వారియర్స్ వైఫ్" గుర్తొచ్చి హఠాత్తుగా గొంతుని బిగబట్టుకున్నాన్నేను .

ఇక్కడ్నుండి ఎక్కడికైనా పారిపోగలిగితే ఎంత బావుణ్ను?... మనిషెప్పుడూ పరిస్థితు ల్నుండి పారిపోడానికే ప్రయత్నిస్తాడు... దయ కూడా అదే చేశాడేమో.

"నాయినా... నా నాయినా... దయా" వాకిట్లో నుండే అరుచుకుంటూ పరుగెత్తు కొచ్చింది అత్త... అత్తని చూడగానే ఇల్లంతా ఏడుపుల్తో హోరెత్తిపోయింది.

"నాయినా ఎంత పనిచేసినావురా దయా... ఈ ముసిలి ముప్పందానా నాకీ కడుపు శోకం పెట్టిపోయినావేందయ్యా. నన్ను తీసుకుపోగూడదా ఆ దేవుడు... మీ నాయిన్తోకూడా పొయ్యుంటే నాకీ ఖర్మలన్నీ చూసేది లేకుండా పొయ్యుణ్ణే... అయ్యోనాయినా... నీకేం కష్టం వచ్చిందిరా... ఒక్కమాట నాతో చెప్పుండకూడదా?... అప్పులుంటే తీర్చుకోగూడదా? దానికి ఇట్టా పని చేసుకుంటారా ఎవురైనా? ప్రపంచంలో ఎవురికైనా అప్పుచెయికుండా, కన్ను కారకుండా బతుకు గడస్తాదా?...

నీ కేం నాయినా... కోటిసూర్య ప్రకారంగా వుండారే మీ అన్నలు... ఒక్కమాట వాళ్ళకి చెప్పుకునుంటే వాళ్ళు నీ అప్పులు తీర్చకపొయ్యుందురా?... నాయినా... నా దయా..."

శోకాలు పెడుతూ ఏడుస్తోన్న అత్తని చూస్తుంటే జాలిగా వుంది నాకు... పైకి అలా అంటోందే కానీ అత్తకి బాగా తెలుసు ఎవరి బతుకులు వాళ్ళవి... తమ్ముడు చేసిన మూడేళ్ళ అప్పులూ తీర్చి, వస్తుందోరాదో తెలియని కొత్త పెట్టుబడి పెట్టడానికి వాళ్ళు సిద్ధంగా లేరు. పొలంలో వాటా అడక్కపోవడమే తాము చేసిన గొప్పత్యాగమని వాళ్ళు భావిస్తూ వుంటారు. నిజానికి ఈరోజు వ్యవసాయం ఎంత కష్టమైపొయ్యిందో, దేశమంతా అక్కడక్కడా ఎంతమంది రైతులు నేల తల్లినీ, కుటుంబాలనీ వదిలి ఆత్మహత్యలు చేసుకుంటుండారో వాళ్ళకి తెలీ కుండా ఏంలేదు... ఛ్చ... ఎవరి బతుకులకీ, ఎవరి చావులకీ ఎవరు జవాబు చెప్తారు...

"దయాకర్ తెంపుచేసుకుని ముందు పొయినాడు. రేపో ఎల్లుండో మనం కూడా ఈ పని చేయాల్సిందే" మొరటుగా కసిగా వున్న ఆ గొంతు ఎవరిదో తెలియడం లేదుగానీ... దయాకర్ తోటి రైతుదన్న సంగతి అర్ధమౌతోంది. బయటి వరండాలో నుండి మాటలు చాలా పెద్దగా విన్పిస్తున్నాయి.

"వానల్లేకపోవడం, కాలంగాని కాలంలో వానలుపడ్డం, ఇవేనా రైతు నష్టపోవడానికి కారణాలు? వాళ్ళు బ్రతకాలన్నాకూడా ప్రభుత్వం బతకనిచ్చేట్టుగాలేదు. రాష్ట్రస్థాయిలో రక్షణ

కోసం నియమింపబడ్డ ప్రజాప్రతినిధుల స్వంతజిల్లాలోనే రైతులు సబ్సిడీ విత్తనాలడిగినందుకు, ముందూ వెనకా లేకుండా లాఠీఛార్జీలు జరుపుతారు.

కరెంటుఛార్జీ తగ్గించమన్నా, విత్తనాలడిగినా, సాగునీరడిగినా, ఆఖరికి తాగునీరడిగినా సరే చావగొట్టి చెవులు మూస్తారు"... మరొకరైతు వాపోతున్నాడు.

నిజమే, ఆమధ్య కరెంటుఛార్జీ కట్టలేదని ఆఫీసర్లు మీటర్లు పెరుక్కుపోయారని దయ చెప్పిన విషయం గుర్తొచ్చింది... దయ చెప్తూనే వున్నాడు... నాకే అర్థమైందికాదు.

నేనేమాలోచిస్తుండానో నాకే తెలియడం లేదు...

నిరామయంగా నిమిషనిమిషానికీ మారిపోతోన్న దయాకర్ శరీరానికేసి చూస్తున్నాను. జ్యోతి పెదనాన్న కూతురు సునీత ఐస్‌గడ్డలు తెచ్చి దయాకర్ పక్కగా, కింద, పొట్టమీద పెడుతోంది... కాసేపటికే అవన్నీ నీరుకారి చాపకింద చేరుతున్నాయి... దయాకర్ కింద వేసిన పరుపు తడిసి ముద్దవుతోంది... నల్లగా కమిలిపోయిన పెదాలమధ్య తులసాకు ముద్ద వికృతంగా కనిపిస్తోంది... సమయంగడిచేకొద్దీ ముక్కుల్లోనుండి నల్లటి ద్రవం బయటి కొస్తోంది. మనిషి బతికుంటే సరేగానీ, ఆ గుటికెడు ప్రాణం కాస్తా పోయిందంటే, ఒక్కరోజు కూడా ఇంట్లో ఉంచుకోం.

"నాయినా... నాయినా... దయమ్మా" అంటూ దయాకర్ ఒళ్ళు, మొహమూ అంతా తడిమి తడిమి ఏడుస్తోంది అత్త... మధ్యమధ్యలో కారుతున్న ముక్కును పమిటచెంగుతో తుడుచుకుంటోంది...

అసలే నల్లగా వున్న అత్త ముఖం మరింత నల్లబడి పీక్కుపోయింది... దూరపు ప్రయాణం వల్లనో, కడుపుశోకం వల్లనో మరి... అత్త చిన్నతనంలో బాధలుపడ్డా పెళ్ళయ్యాక మామయ్య ప్రేమలో వైభవంగానే బతికింది... మామయ్య ఇదే పొలంలో అప్పచెల్లెళ్ళ పెళ్ళిళ్ళు జరిపించి, పుట్టింటి సారెలు జరుపుతూ, పెద్దకొడుకులిద్దరినీ చాలా పెద్దచదువులు చదివించి... ఊరికంతా మొదటి కుటుంబంగా జీవించాడు... మామయ్య మరణం తర్వాత అత్త కొంత కుంగిపోయినా పెద్దకొడుకులిద్దరూ మంచి ఉద్యోగాల్లో వుండడంతో వాళ్ళ వద్ద కొంత ప్రశాంతంగానే వుంటోంది... ఇంతలో పూడ్చలేని అగాధం.

"నాయినా... నీ మనసులో ఏంబెట్టుకున్నావో కదా... మొన్నీ నడమ నేనొచ్చినపుడు కూడా తెంపుగా లేడమ్మా బిడ్డ ... ఏం కష్టమొచ్చిందో ఏమో"

అత్తకి అన్నీ తెలుసు... కేవలం దిగజారిన ఆర్థిక పరిస్థితులు... వర్షాల్లేక, వివిధ కారణాలవల్ల మూడేళ్ళుగా పంట దిగుబడి లేకపోవడం, పెట్టిన పెట్టుబడి... తాలూకూ వడ్డీ... వడ్డీలు మనిషిని తినేశాయని. అయినా ఇందులో తన కొడుకు తప్పేమీలేదనీ, ఆ నిందని ఎవరో ఒకరి మీదకి నెట్టాలని చూస్తోంది.

అత్త ఏడుపాపడంలేదు... చనిపోయిన కొడుకుని ఏ ఆపద్బాంధవుడో వచ్చి ఊపిరిచ్చి హఠాత్తుగా బతికిస్తే బావుండునని పరితపిస్తోంది. ఆమె ఏడుపు చూసి అక్కడున్న వారందరి గుండెలూ చెరువులవుతున్నాయి.

"అమే రత్నమ్మా... ఏందిది. వచ్చినప్పట్నుండీ ఏడస్తానే వుండావు... మన చేతుల్లో ఏం వుండాది చెప్పు?... నీకసలే వళ్ళు బాగాలేదు గమ్మునుండు..." మా పెద్దమ్మ అత్త భుజం

మీద చెయ్యేసి ఓదార్చడానికి ప్రయత్నిస్తోంది... అయితే ఆమె మాటలు ఆమెకే పీలగా వుండాయి.

"ఒదినా నన్ను కొంచెంసేపు కొట్టుకోనీండమ్మా. నా బిడ్డను మళ్ళెప్పుడు చూడబోతాను... అప్పుల కోసమైతే భయపడ్డమ్మా... ఇంకేందో జరిగుండాది." అంటూ పెదమ్మ మీద పడి గుండెలు బాదుకుంటోంది.

ఏందో జరిగుండాది అన్న అత్త మాట నిజ్జంగానే నిజమని నాకప్పటికి అర్థంకాలేదు.

"ఆ ఆ... జరిగింది చట్టుబండలు... మీ అబ్బయ్యకేం కష్టమొచ్చిందమ్మా... గుట్టుగా ఇంత గొంతులో పోసుకుని నా బిడ్డను అన్యాయం చేసి పోయినాడు... ఇంక జీవితాంతం పడాల్సిందంతా నా బిడ్డే కదా... ఏదో చదువులేకపోయినా మంచిపిల్లోడు, మంచి కుటుంబం అంటే సరేననుకున్నామమ్మా... ఇట్టా ముంచేసిపోతాడనుకోలేదు..." అత్త మాటలకి రిటార్టులా జ్యోతి వాళ్ళమ్మ తన చుట్టుపక్కల కూర్చునివున్న తమ ఊరివాళ్ళతో చెప్పుకుని తన కూతురు భవిష్యత్తును తలచుకుని తలచుకుని శోకాలు తీస్తోంది... ఆమె చెప్తోన్నది కూడా న్యాయమే నన్నట్లుగా అందరూ తలలూపుతూ ముక్కులెగబీలుస్తున్నారు.

ఈ మొత్తం గందరగోళానికి జ్యోతి మళ్ళీ బరస్ట్ అయిపోయింది...

"అప్పులుంటే మాత్రం ఏంమ్మా?... అమ్మి అప్పులు తీర్చేస్తే కూలీ చేసుకునయినా బతికుంటాంగదా? ఏది పోయినా మళ్ళీ సంపాదించుకోవచ్చుగానీ ప్రాణంపోతే తిరిగి తేగలమా? అయ్యో ఎంత పని చేశావయ్యా..." అంటూ.

జ్యోతి ఏడుపు విని ఆమె తండ్రి పరిగెత్తినట్లుగా లోపలికొచ్చాడు...

"అమ్మి ముందు ఎవురయినా ఏడ్చినారంటే చూడండి" అంటూ అందర్నీ ఒకసారి హెచ్చరించినట్లుగా గదమాయించి వచ్చినంత హడావుడిగానూ బయటికెళ్ళిపోయాడు.

యజ్ఞకుండంలో నుండి ద్రౌపది పుట్టిందంటారు.

జ్యోతిని చూస్తుంటే దుఖపుజ్వాలల్లో నుండి ప్రభవించిన ఆకారంలా వుంది. ఆ అమ్మాయి దుఖాన్ని, దయపట్ల ఆమెకున్న ప్రేమని, అనుబంధాన్నీ ఆపడం ఎవరికి సాధ్యం? ప్చ్... ఏమైనా ఈ మగవాళ్ళు దయలేనివాళ్ళు. ఆడవాళ్ళని సుఖపెట్టాలన్నా, దుఖంలోకి నెట్టేయాలన్నా వాళ్ళకే సాధ్యమౌతుంది. తను వెళ్ళిపోయాడు అప్పుల్ని తప్పించుకుని. జ్యోతి ఎక్కడికెళ్ళగలదు ఈ బిడ్డల్నొదిలి...

పొద్దుట్నుండి ఒకేస్థితిలో కింద కూర్చుని వుండడంతో పట్టుకుపోయిన మోకాళ్ళని సడలించుకుంటూ మెల్లిగాలేచి వెనక వరండాలోకి వెళ్ళాను. నేను బాత్రూమ్‌లో నుండి బయటికొచ్చేసరికి పెద్దమ్మ, అత్త పెద్దకోడలు శారద మాట్లాడుకుంటుండారు. దయాకర్ చేసిన తొందరపాటుపనినీ, జ్యోతి జీవితాన్నీ తలచుకొని బాధపడుతున్నారిద్దరూ. నన్ను చూడగానే శారద వంటగదిలో కెళ్ళింది కాఫీ కలుపుకొస్తానంటూ.

"పెదమ్మా అమ్మావాళ్ళేరీ? ఇంకారాలేదు" పొద్దుట్నుండీ అర్థంకాకుండా వున్న ప్రశ్నని సంధించాను.

పెద్దమ్మ నాకేసి దిగాలుగా చూసింది .

"అయ్యో ఎందుకు చెప్తావులేమ్మా... మొన్నటిరేత్రి మీ నాయన కూడా ఇదేపని...

పురుగులమందు డబ్బా ఎత్తుకున్నాడంట. మీ అమ్మచూసి లాక్కుని ఒకటే ఏడుపు... నేల అమ్మేస్తానని మీ అన్నా, వద్దనేవద్దని మీ నాయన... అప్పులోళ్ళ బాధపడలేక ఇద్దరూ ఇంట్లో ఒకటే తగువులూ, రచ్చలూ... మీ అమ్మ నలిగి ఛస్తా వుండాదనుకో... నేను నిన్న పొద్దన్నే ఊరికి బొయి మీ అమ్మనీ, నాయన్నీ ప్రయాణంచేసి తిరుపతికి అంపించినా. పొయ్యి దేవుడి దర్శనం చేసుకుని నాలుగుదినాలుండి రాబోండి అని"

పెద్దమ్మ కూతురు మంజులక్క తిరుపతిలో వుంటుంది. మేమంతా ఒకేచోట ఒక తల్లి పిల్లల్లా పెరగడంతో ఏమాత్రం తేడాలుండవు.

"ఒకేఒక్క నిమిషమే చినమ్మే... మీ అమ్మగాన చూడకుండా వుండుంటే ఈ పొద్దు చిన్నదినమై పోయుణ్ణు... పెద్దోళ్ళూ అదే పనైపోయా... చిన్నోళ్ళూ ఇదే పనైపోయా... ఏమి వ్యవసాయమో పోమ్మా. అప్పుల్దెచ్చి పంటలు పెట్టడమేగానీ పైసా చేతికి రాకపోయ... ఎట్ట తట్టుకోని ఎట్ట నిలబడాల చెప్పు... మీ అన్న చెప్పినట్టు నేల అమ్మేసి యాడైనా బొయ్యి ఏదో ఒకటి చేసుకునేది మేలుగా వుండాది..."

రైతు కుటుంబాలన్నీ నేలమీద నమ్మకాన్ని కోల్పోవడం ఎంత దీనమైన పరిస్థితి...

"అందురూ యాపారాలుచేస్తే వడ్లు పండించేదెవరు పెద్దమ్మా. తిండిగింజలెట్టా మనకి?" నీరసంగా అని వేగంగా కొట్టుకుంటూన్న గుండెతో వెళ్ళి వరండాలో వున్న కుర్చీలో కూలబడ్డాను.

అప్పటికే అక్కడ దయాకర్ పెద్దన్న, చిన్నన్న, మా అన్న రఘు, సురేష్ అంతా కూర్చుని దయాకర్ పెద్ద సేద్దిగాడు వెంకటయ్యతో మాట్లాడుతుండారు.

"అంత బాగుణ్ణిందయ్యా ఈసారి చెనిగ... మూడేళ్ళ అప్పులన్నీ తీరిపొయినాయిబో అబ్బయ్యకి అనుకున్నా... ఇంక ఇరవై దినాలుంటే సాలు పెరికేసుండొచ్చు... ఇంతలోపల అదేం తెగులో కొత్తరకం తెగులు... అది పట్టింది. నిలవన ఆకులన్నీ రాలిపోయి పుల్లలు నిలబడ్డాయి. అప్పుటికీ మళ్ళీ ఆ మల్లికార్జున దగ్గర పురుగులమందులూ, బలానికి మందులూ అన్నీ తెచ్చేసినాడు. అన్నగచాట్లూ పడి నీళ్ళు పెడ్తిమి... పురుగు చావనేలేదు, పంట ఎక్కిరానే లేదు. ప్చ్... ఈ ఒక్కసారి పండుంటే అబ్బయ్య ఈ పని చేసుండడయ్యా..." కళ్ళనీళ్ళు పెట్టు కుంటున్నాడు వెంకటయ్య. వెంకటయ్య ఆ ఇంట్లో రెండు తరాల సేద్యానికి సాక్షి. మామయ్య వున్నప్పట్నుండి ఈ ఇంటినీ, పొలాన్నీ కనిపెట్టుకుని వున్నాడు. ఇదే పొలంలోని ఫలసాయంతో ఈ ఇల్లు ఎలా పాలుపొంగినట్టు పొంగిందో వైనవైనాలుగా వెంకటయ్య చెప్తుంటే గతంలో చాలాసార్లు విని వున్నాను.

"ఏమైనాన్నా ఈ గవర్నమెంటు ఆర్థికసూత్రాలన్నీ రైతుల్ని ముందుగా దెబ్బకొడు తున్నాయి. రకరకాల పథకాల పేరుతో కోట్లు ఖర్చుచేసే ప్రభుత్వం రైతు సబ్సిడీల్ని తగ్గించి పారేసి, కరెంటుఛార్జీల్ని పెంచేసె... పేదరికం పెరిగిపోతుండాదేకానీ అభివృద్ధి ఏడ జరగ తుండాదినా? పోయిన సంవత్సరం వెయ్యమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇప్పుడు మొన్న చూసినావుగదా, రైతులు సాగునీరడిగినందుకు రోడ్ల మీద నిలబెట్టి లాఠీలతో కొడితిరి. మళ్ళీ ఇప్పుడు ఆటలకి ఐదొందలు కోట్లు ఖర్చు చేసి జాతీయక్రీడలంటిరి. ఆకలికంటే ఆటలే ముఖ్యంనా ప్రభుత్వానికి. ఆకలికంటే ఇప్పుడు అభివృద్ధే ముఖ్యంబో" దయాకర్

చిన్నన్న కసిగా అంటున్నాడు. భాస్కర్ హైదరాబాద్‌లో వుంటోన్నా అక్కడి హైటెక్ అభివృద్ధిపట్ల అతడికెప్పుడూ నిరసనే.

"నేనా నడమ హైదరాబాద్ వచ్చినప్పుడు చూస్తినే... కంప్యూటర్లూ, సైబర్‌కేఫ్‌లూ, హైటెక్ సిటీ మద్రాసునీ, బొంబాయినీ మించిపొయ్యేండాదనుకో..." నవ్వడానికి ప్రయత్నించి దిగాలు పడ్డాడు ప్రభాకర్... దయాకర్ పెద్దన్న.

నాకు కడుపులో దేవినట్లుగా అయింది. అక్కడెక్కడో పత్తి రైతుల ఆత్మహత్యలు. మరెక్కడో మరో రైతూ వినడమే తప్ప ఇప్పుడా వైరస్ ఇక్కడికి కూడా పాకుతోందా? నాన్న విషయం విన్నప్పట్నుండీ నా వంట్లో రక్తాన్నంతా ఎవరో తోడేసినట్లు నీరసంగా అయి, చమటలు పడుతోంది. నన్ను నేను సంభాళించుకోవడం కష్టంగానూ వుంది. నేను ఉద్యోగస్తురాలిననీ, ఎప్పుడూ ఇంటాబయటా పనులవత్తిడిలో వుంటాననీ చాలా విషయాలు నాకు తెలియనివ్వరు అమ్మావాళ్ళు.

నిజమే ఎన్నెన్నో కోట్లు రకరకాల పనులమీద ఖర్చుపెట్టే ప్రభుత్వం రైతుల్నీ, సాగునీటినీ మాత్రం పట్టించుకోదు. ఇది చివరికి ఎట్టవుతాదో. వ్యవసాయంమీద పడిన దెబ్బ మెల్లిగా టౌన్లోని అన్ని వ్యాపారాలమీద కూడా ప్రభావం చూపిస్తోంది. చుట్టూ పల్లెటూర్ల నుండి కస్టమర్లెవరూ రాకపోవడంతో నెల్లూరులో వస్త్ర వ్యాపారులు, పప్పులంగడివాళ్లూ మందులంగళ్ళూ, చివరికి రిక్షావాళ్ళు కూడా ఇదివరకంటే తమ రాబడి తగ్గిపోయిందని వాపోతున్నారు.

ఇది మొత్తం మన ఆర్థికవ్యవస్థని ఎంత దెబ్బతీస్తుందో, చివరికి ఎంత ప్రమాదకరమో ఎవరికీ అర్థంకావడంలేదు. పేదోళ్ళు పెరిగిపోతారు. జనాలంతా వర్గాలువర్గాలుగా విడగొట్టబడ్తుండారు .

ఒకపక్క భాస్కర్, ప్రభాకర్ వంటివాళ్ళు కార్పొరేట్ కంపెనీల్లో, ఏ.సి. గదుల్లో కంప్యూటర్ల ముందు కూర్చుని వేలు సంపాదిస్తారు. ఈ కొత్త కార్మికవర్గాన్ని అభివృద్ధిగా అంతా గౌరవిస్తుంటారు. మరొకపక్క దేశానికి వెన్నెముకలని పొగడబడ్డ రైతులంతా స్వచ్ఛమైన గాలిలోనే, నకిలీ పురుగులమందులతో ఊపిరాడక గిలగిలా తన్నుకుంటుంటారు. అంతా అయిపోతుంది.

వాళ్ళ కన్నీళ్ళకు, కష్టాలకు, అప్పులకూ మొత్తం సమస్యలకూ కారణాల్ని వెతక్కుండా శవాలమీద నాలుగు డబ్బులు చల్లి తృప్తిపెట్టాలని చూస్తుంటుంది ప్రభుత్వం.

"కన్సల్టెన్సీలూ, సైబర్ కేఫ్‌లూ, ప్రపంచబ్యాంకూ పంటలు పండిస్తాయా? పిజ్జాలూ, బర్గర్లూ, రోటీలూ మామూలు మనిషి ఆకలి తీరుస్తాయా?" సురేష్ అంటున్నాడు.

గుండెల్లోనో, కళ్ళల్లోనో తెలీకుండా నీళ్ళు ఊరుతూనే వున్నాయి. ఉద్వేగాన్ని ఆపుకోడానికి ప్రయత్నించి పెదవులు వణుకుతున్నాయి. ఇది ఇట్లానే ... ఇట్లానే కొనసాగుతుందా?

"అయ్యా మీకు చెప్పకూడదనుకున్నాను కానీ... నిన్న సాయంత్రం మల్లికార్జున, బుజ్జిశెట్టి వాళ్ళు వచ్చి అప్పు ఇప్పటికిప్పుడు కట్టమని అబ్బయ్య నెత్తిన కూర్చున్నారు... సాధించేసినారనుకో... నిన్ననే కాదయ్యా బుజ్జిశెట్టి ఈ నడమ ఆరునెలల నుండీ ఇంటికాడుంటే ఇంటికాడికీ, కయ్యకాడుంటే కయ్యకాడికీ వచ్చి వేధించిపారేసినాడు...

పురుగులమందులూ , ఎరువులంగడి మల్లికార్జున మాత్రం చిన్నంగా మాట్లాడినాడా?

ఈసారి కానూరి రాజు ఇత్తనాలు యీనంటే యీనని పట్టుబట్టేసినాడు... బతిమాలి బామాలి తలతాకట్టు పెట్టి తెస్తిడి... వీళ్ళందరికీ ఏమని జవాబుచెప్పాలో తెలీక అబ్బయ్య మనేధ పడిపొయినాడు.

నిన్నయితే బుజ్జిశెట్టి ఎంత సర్దిచెప్పినా ఇనకుండా... అయ్యా నేనెట్ట చెప్పేది నా నోటితో...

నీ పెళ్ళాన్యాడైనా పండబెట్టయినా మా అప్పు తీర్చమన్నారయ్యా... ఆ మాటతో కూడా అబ్బయ్య ఇరక్తి చెందిపొయినాడు... అప్పుటికీ కనిపెట్టుకోని ఇంటిదాకా వదిలిపెట్టి పొయినా నయ్యా... ఈ పొద్దువాళ్ళు మళ్ళా వస్తామని చెప్పి పొయినారు... రాత్రికిరాత్రి ఇంత పని చేస్తాడనుకోలేదయ్యా..." గుసగుసగా అన్నలతో చెప్పి ఏడుస్తున్నాడు వెంకటయ్య.

నా గుండెలవిసిపోయాయి. నా శరీరం కుర్చీకి అతుక్కుపోయినట్లుంది. మంచులా గడ్డ కట్టుకుపోయింది ఏందో జరిగుండాదమ్మా అంటూ అత్త ఏడవడం వెనక ఇంత పెద్ద నిజంవుంటుందని ఎవరూ ఊహించలేదు .

చాలాసేపు ఆ నిశ్శబ్దాన్ని ఎవరూ ఛేదించలేదు... చివరికి పెదమ్మ వచ్చి ఎత్తుబడికి ప్రయత్నాలు జరగతుండాయని పిలిచేదాకా ఎవ్వరి కాళ్ళల్లోనూ, వంట్లోనూ శక్తిలేదు. ఎవ్వరి నోట్లోనూ చెమ్మలేదు. అప్పటికి సూర్యుడు పడమటి కొండల్లోకి దిగబాకుతుండాడు.

* * *

ఆ రాత్రి తిరిగొస్తూంటే రోడ్డుమీదనున్న శవాలన్నీలేచి కారుకు ఎదురొచ్చినా నాకు దిగులే తప్ప భయమేయలేదు. ఇప్పుడవి శవాల్లా, దయ్యాల్లా అన్పించలేదు నాకు. జీవితం వెక్కిరించిన ఎంతోమంది దయాకర్‌లు అర్ధాంతరంగా వదిలి వెళ్ళిపోయిన తమ కుటుంబాల గురించి ఏడుస్తూ, ప్రశ్నిస్తూ ఎదురొస్తున్నట్లుంది. నాదగ్గర ఎటువంటి సమాధానం లేకపోవడంతో నిర్భావంగా వారికేసి చూడసాగాను.

ఎక్కడో పామునోట్లో చిక్కిన కప్ప ఒకటి విడిపించుకోలేని పరిస్థితుల్లో దీనంగా, హృదయవిదారకంగా మూలుగుతోంది.

ఆదివారం ఆంధ్రజ్యోతి, ఆగస్టు 2003